బీమ్లాతండా రోడ్డుకు మోక్షమెప్పుడో..

- గత ప్రభుత్వం హయాంలో కోటిన్నర నిధులు మంజూరు
- మట్టి పనులు చేపట్టి నిలిపివేసిన కాంట్రాక్టర్
- అధ్వాన రోడ్డుపై గిరిజనుల అవస్థలు
- బీటీగా మార్చాలని వేడుకోలు


అధ్వానంగా బీమ్లాతండా -సుల్తాన్‌పూర్‌తండా మట్టి రోడ్డు

మఠంపల్లి : మండలంలోని బీమ్లాతండా రోడ్డు అధ్వానంగా ఉంది. మట్టపల్లి -హుజూర్‌నగర్ ప్రధాన రహదారిపై గల సుల్తాన్‌పూర్‌తండా (పునరావాస కాలనీ) నుంచి సుమారు 2 కిలోమీటర్ల దూరంలో ఉండే బీమ్లాతండా వరకు గల ఈ మట్టి రోడ్డుపై రాకపోకలు సాగించేందుకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అంతేకాకుండా ఈ రోడ్డు వెంట కంపచెట్లు దట్టంగా పెరిగి ప్రయాణానికి ఆటంకంగా మారాయి. అయితే బీమ్లాతండా నుంచి సుమారు కిలోమీటరు దూరంలో భోజ్యాతండా ఉంది. ఇక్కడి గిరిజనులు కూడా మట్టపల్లి- హుజూర్‌నగర్ ప్రధాన రహదారి చేరుకోవాలంటే ఇదే మార్గం గుండా వెళ్లాలి. దీంతో వీరికీ తిప్పలు తప్పడం లేదు. రోడ్డు బాగా లేక బీమ్లాతండా, భోజ్యాతండాల నుంచి గిరిజనులు ప్రధాన రహదారి చేరుకోవడానికి గుర్రంబోడుతండా, కృష్ణాతండాల మీదుగా చుట్టూ తిరిగి 5 నుండి 6 కిలోమీటర్ల దూరం తిరిగి వెళ్లాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే ఈ రోడ్డు నిర్మాణానికి గత ప్రభుత్వ హయాంలో సుమారు కోటిన్నర నిధులు మంజూరయ్యాయి. కాంట్రాక్ట్ దక్కించుకున్న వ్యక్తి రోడ్డుపై మట్టి పనులు చేపట్టి వదిలేశాడు. బీటీ రోడ్డు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. అధికారులు, పాలకులు దృష్టి సారించి మధ్యలోనే ఆగిపోయిన బీమ్లాతండా -సుల్తాన్‌పూర్ తండా దారి పనులను పునప్రారంభించి బీటీ రోడ్డుగా మార్చాలని ఆయా తండాల గిరిజనులు కోరుతున్నారు.

నాలుగేళ్లుగా ఎదురుచూస్తున్నాం


బీమ్లాతండాకు బీటీ రోడ్డు నిర్మాణానికి గత ప్రభుత్వం రూ.కోటిన్నర నిధులు మంజూరు చేసింది. పనులు ప్రారంభించిన సదరు కాంట్రాక్టర్ కేవలం మట్టి వేసి పనులు అర్ధాంతరంగా నిలిపివేశారు. మళ్లీ అధికారులు, కాంట్రాక్టర్ పట్టించుకున్న దాఖలాలు లేవు. నేటికీ ఈ రోడ్డు బీటీకి నోచుకోకపోవడంతో నాలుగేళ్లుగా ఎదురుచూస్తున్నాం.

– భూక్యా పాండునాయక్, బీమ్లాతండా

బీటీ రోడ్డు నిర్మించాలి


బీమ్లాతండా, భోజ్యాతండా గిరిజనులు ప్రధాన రహదారికి చేరుకోవడానికి ఇదొక్కడే రోడ్డు మార్గం. రోడ్డుకు ఇరుపక్కల కంపచెట్లు కమ్మేయడంతో రాత్రి సమయంలో ఈ దారి గుండా వెళ్లాలంటే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి బీటీ రోడ్డు నిర్మించాలి.

– బానోతు రాజునాయక్, సుల్తాన్‌పూర్‌తండా

కొనసాగుతున్న విగ్రహాల ప్రతిష్ఠాపనోత్సవాలు


హోమం నిర్వహిస్తున్న అర్చకులు, గ్రామస్తులు

మఠంపల్లి : మండలంలోని హనుమంతులగూడెంలో నూతనంగా నిర్మించిన రామాలయంలో సీతారామ లక్ష్మణ, ఆంజనేయస్వామి, ధ్వజస్తంభం, గ్రామ దేవతలైన ముత్యాలమ్మ, అంకమ్మ, పోతరాజుల విగ్రహాల ప్రతిష్ఠాపనోత్సవాలు రెండవ రోజు మంగళవారం వైభవంగా కొనసాగాయి. ఈ సందర్భంగా యాజ్ఞీకులు లక్ష్మీనారాయణశర్మ ఆధ్వర్యంలో సుప్రభాతసేవ, లక్ష్మీగణపతి, రుద్ర, సుదర్శన, శ్రీసూక్త సహిత లక్ష్మీహోమాలను ప్రత్యేక యాగశాలలో ఘనంగా నిర్వహించారు. అదేవిధంగా విగ్రహాలకు జలాదివాసం,, ధాన్యాదివాసం, శయ్యాదివాసం, బలిహరణ వంటి కార్యక్రమాలు పూర్తిగావించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. బుధవారం ఉదయం యంత్రబింబ స్థాపనలు, విగ్రహాల ప్రతిష్ఠ ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. అన్నదానం ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అర్చకులు శ్రీరామయ్యశర్మ, రాజశేఖరశర్మ, గ్రామపెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

సీతరాంపురంలో తాగునీటి సమస్య


ట్యాంకర్ వద్ద నీళ్లు పట్టుకుంటున్న డబుల్ బెడ్ రూం ఇళ్ల కాలనీవాసులు

చిలుకూరు : మండలంలోని సీతరాంపురం గ్రామంలో డబుల్ బెడ్ రూం ఇళ్ల కాలనీవాసులు తాగునీటి సమస్యతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇళ్ల వద్ద గల బోరు మోటార్ మరమ్మతులకు గురై ఐదారు నెలలవుతుందని, ఈ విషయమై అనేకసార్లు గ్రామ పంచాయతీ అధికారులకు విన్నవించినా నేటివరకు పట్టించుకున్న నాథుడే లేరని ప్రజలు ఆరోపిస్తున్నారు. బోరు మోటారుతో పాటు చేతిపంపు కూడా పనిచేయక నీటి కోసం అవస్థలు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాగునీటి కోసం అధికారులను నిలదీయగా మంగళవారం గ్రామ పంచాయతీ ట్యాంకర్ ద్వారా నీటిని సరఫరా చేసినట్లు తెలిపారు. విద్యుత్ మోటార్‌కు తక్షణమే మరమ్మతులు చేపట్టి మంచినీటి సమస్యను పరిష్కరించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

అసంపూర్తిగా డబుల్ రోడ్డు నిర్మాణం


గణపవరం శివారులో తారు వేయకుండా వదిలేసిన రహదారిని చూపుతున్న నాయకులు

మునగాల : మండల కేంద్రం నుంచి కొక్కిరేణి మీదుగా గరిడేపల్లి మండలం కీతవారిగూడెం వరకు సుమారు రూ.పది కోట్ల వ్యయంతో చేపట్టిన డబుల్ రోడ్డు నిర్మాణ పనులు అసంపూర్తిగానే మిగిలిపోయాయి. రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించి ఏడాది పూర్తయింది. అయినా సదరు కాంట్రాక్టర్ పూర్తిస్థాయిలో పనులు చేయలేదు. మండలంలోని గణపవరం శివారులో సుమారు 300 మీటర్లు, మునగాల శివారులో 100 మీటర్లు తారు రోడ్డు వేయకుండా వదలివేశాడు. దీంతో కంకర తేలి నిత్యం దుమ్ము, దూళితో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. అంతేకాకుండా వాహనాలు అదుపుతప్పి గాయాలపాలవుతున్నారు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో రోడ్డు పనులు అసంపూర్తిగా వదిలేసినా అధికారులు పట్టించుకోకపోవడం శోచనీయమని కొక్కిరేణి గ్రామానికి చెందిన సీపీఎం మండల కమిటీ సభ్యుడు నందిగామ సైదులు మంగళవారం ఆరోపించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే అసంపూర్తిగా ఉన్న రోడ్డు నిర్మాణ పనులు పూర్తిజేయాలని ఆయన కోరారు.

క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నేరేడుచర్ల : ముకుందాపురం సబ్ స్టేషన్ పరిధిలో గల కల్లూరు ఫీడర్ కింద చెట్ల కొమ్మలను తొలగిస్తున్నందున కల్లూరు పరిసరాల గ్రామాల్లో బుధవారం ఉదయం 8గంటల నుంచి 11గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ మండల ఇన్‌చార్జ్ ఏఈ పందిరి శ్రీనివాస్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సిబ్బందికి సహకరించాలని కోరారు.

కొండాపురం ఫీడర్ పరిధిలో..

చిలుకూరు : మండల కేంద్రంలోని విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో 11కేవీ లైన్ మరమ్మతుల కారణంగా కొండాపురం ఫీడర్ పరిధిలో బుధవారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ట్రాన్స్‌కో ఏఈ రామిశెట్టి శ్రీనివాస్‌రావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

కేఎస్‌ఆర్ ట్రస్ట్ సేవలు అభినందనీయం


చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు మల్లికార్జున్‌రావు

హుజూర్‌నగర్ : కేఎస్‌ఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు తన్నీరు మల్లికార్జున్‌రావు అన్నారు. మంగళవారం హుజూర్‌నగర్ పట్టణంలో గల శాంతి స్థూపం వద్ద కేఎస్‌ఆర్ ట్రస్ట్, కస్తాల దిల్ మిత్రమండలి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు గల్లా వెంకటేశ్వర్లు, కె.మహేష్, యోహాన్, ముక్కంటి, సైదులు, శివ, అలీ, రాము, కిరణ్, వెంకటేశ్వర్లు, హరికృష్ణ, గోపి తదితరులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం


అన్నదానం చేస్తున్న దాతలు

మునగాల : మండలంలోని ముకుందాపురం శివారులో గల ఇందిర అనాథ వృద్ధాశ్రమంలో మంగళవారం మండలంలోని గణపవరం గ్రామానికి చెందిన చందా సత్యం సతీమణి సత్యవతి నాల్గవ వర్ధంతి సందర్భంగా కుటుంబ సభ్యులు అన్నదాన వితరణ చేపట్టారు. ఈ సందర్భంగా సత్యం మాట్లాడుతూ.. తన భార్య జ్ఞాపకార్థం వృద్ధాశ్రమంలో వృద్ధులు, అనాథలకు అన్నదానం చేయడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో చందా రమేష్- నర్మద, పురుషోత్తమరావు- లావణ్య, వెంకటేశ్వర్లు- ప్రీతి దంపతులు, జుట్టుకొండ శ్రీదేవి -సత్యనారాయణ దంపతులు, ఆశ్రమ వ్యవస్థాపకురాలు నాగిరెడ్డి విజయమ్మ, కోఆర్డినేటర్ వాచేపల్లి జ్యోతి పాల్గొన్నారు.

ములకలపల్లి కుమారి మృతి

మునగాల : మండలంలోని కొక్కిరేణి గ్రామానికి చెందిన సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ములకలపల్లి రాములు సతీమణి కుమారి (50) మృతి చెందారు. గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మరణించారు. కుమారి మృతి పట్ల మునగాలకు చెందిన సీపీఎం నాయకులు ఒక ప్రకటనలో సంతాపం ప్రకటించారు. కుమారి మృతి బాధాకరమని అన్నారు. సంతాపం తెలిపిన వారిలో సీపీఎం సీనియర్ నాయకులు మేదరమెట్ల వెంకటేశ్వరరావు, పార్టీ నాయకులు కోట గోపి, బుర్రి శ్రీరాములు, బచ్చలకూరి స్వరాజ్యం, దేవరం వెంకటరెడ్డి, జూలకంటి విజయలక్ష్మి, షేక్ సైదా, చందా చంద్రయ్య, మండల కమిటీ సభ్యులు ఉన్నారు.

వరికొయ్యలకు నిప్పు.. తప్పిన ప్రమాదం


తగలబడుతున్న వరికొయ్యలను నీటితో చల్లారుస్తున్న గ్రామ పంచాయతీ సిబ్బంది

నడిగూడెం : మండలంలోని రామాపురంలో ఒట్టి యాలాద్రి పొలం పైభాగాన మంగళవారం గుర్తు తెలియని వ్యక్తులు వరికొయ్యలకు నిప్పు పెట్టారు. దీంతో ఈదురుగాలులకు మంటలు రామాపురంలోని హరిజన కాలనీ వైపు వ్యాపిస్తుండడంతో స్థానికులు కోదాడ అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇచ్చారు. గ్రామ పంచాయతీ సిబ్బంది కూడా అప్రమత్తమై పంచాయతీ ట్రాక్టర్ నీటితో మంటలను చల్లార్చారు. దీంతో పెను ప్రమాదం తప్పింది. ఇదే రాత్రి సమయమైతే కాలనీలో ఉన్న వరిగడ్డి వాములు, పూరిళ్లు అగ్నికి ఆహుతి అయ్యేవని, అగ్నిమాపక సిబ్బంది, గ్రామపంచాయతీ సిబ్బంది సకాలంలో స్పందించడంతో ప్రమాదం తప్పిందని గ్రామస్తులు తెలిపారు.

రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించాలి


సమావేశంలో మాట్లాడుతున్న గన్నా చంద్రశేఖర్

హుజూర్‌నగర్ : ఖరీఫ్ సీజన్ ప్రారంభం అవుతున్నందున ప్రభుత్వం రైతులకు నాణ్యమైన విత్తనాలు సరఫరా చేయాలని సీపీఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు గన్నా చంద్రశేఖర్ కోరారు. మంగళవారం హుజూర్‌నగర్‌లోని సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వానాకాలం సీజన్‌లో ఎరువుల కొరత రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. రైతు భరోసా నిధులు వెంటనే విడుదల చేసి రైతుల ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో సరైన సౌకర్యాలు లేక రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అకాల వర్షాల వల్ల తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కొనుగోలు కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించాలని కోరారు. ధాన్యానికి సరైన గిట్టుబాటు ధర లభించడం లేదని ఆరోపించారు. ప్రభుత్వం రైతుల సంక్షేమ కోసం కృషి చేయాలని ఆయన కోరారు. సమావేశంలో సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు యల్లవుల రాములు, పట్టణ కార్యదర్శి గుండు వెంకటేశ్వర్లు, గాంధీ రమణ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

నడిగూడెం : కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను పేదలు సద్వినియోగం చేసుకోవాలని చెన్నకేశ్వాపురం సీఎస్‌సీ నిర్వాహకుడు మేకల నాగరాజు కోరారు. మంగళవారం అదే గ్రామానికి చెందిన ఓర్సు భీమరాజుకు ప్రధాన మంత్రి విశ్వకర్మ యోజన పథకం కింద మంజూరైన టూల్ కిట్‌ను ఆయన అందజేసి మాట్లాడారు. భీమరాజు గతంలో వృత్తి నైపుణ్యంపై ఏడు రోజులు ప్రత్యేక శిక్షణ తీసుకున్నాడని తెలిపారు. కార్యక్రమంలో శివరాత్రి వీరస్వామి, కోటేశ్వరరావు, ఉపేందర్, మహేష్ పాల్గొన్నారు.

బీసీలు హక్కుల కోసం పోరాడే సమయం ఆసన్నమైంది


సతీష్‌కు నియామకపత్రం అందజేస్తున్న శ్రీనివాస్‌రావు

హుజూర్‌నగర్ : బీసీలు తమ హక్కుల సాధన కోసం పోరాడే సమయం ఆసన్నమైందని జాతీయ బీసీ సంక్షేమ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు డి.శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం పట్టణంలోని బీసీ భవన్‌లో ఆ సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని లక్కవరం గ్రామానికి బీసీ సంఘం యూత్ అధ్యక్షుడిగా కాసారపు సతీష్‌ను నియమిస్తూ నియామకపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. జనాభాలో 52 శాతం ఉన్న బీసీలకు సామాజికంగా, రాజకీయంగా దక్కాల్సిన వాటా దక్కడం లేదని అన్నారు. బీసీలు అనేక రంగాల్లో వెనకబాటుకు గురవుతున్నారని తెలిపారు. జనాభా ప్రాతిపదికన బీసీలకు అందాల్సిన వాటా కోసం ఉద్యమించాల్సిన అవసరం ఉందని ఆయన తెలిపారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు బీసీలకు ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు బి.గోవిందరావు, అంజియాదవ్, గూడెపు దీప, నరసింహచారి, కె.శేఖర్, ఎం.సైదయ్య, కె.కృష్ణ, బ్రహ్మచారి, శ్రీనివాస్, గోపి, బి.నాగేశ్వరరావు, యుగంధర్‌చారి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా హనుమాన్ శోభాయాత్ర


మునగాల : హనుమాన్ శోభాయాత్రలో పాల్గొన్న హనుమాన్ మాలధారులు

మునగాల : హనుమాన్ జయంతిని పురస్కరించుకొని మంగళవారం మునగాల మండల కేంద్రంలో హనుమాన్ శోభాయాత్రను శ్రీరామలింగేశ్వర హనుమాన్ దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. హనుమాన్ ఉత్సవ విగ్రహాన్ని రథంపై ఉంచి పుర వీధుల్లో శోభాయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు హనుమాన్ విగ్రహానికి హారతినిచ్చి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు తూముల వీరస్వామి, గంధం అంజయ్య, కమిటీ సభ్యులు, హనుమాన్ మాలధారులు పాల్గొన్నారు.


హుజూర్‌నగర్‌రూరల్ : పూజలో పాల్గొన్న భక్తులు

హనుమాన్ జయంతి వేడుకలు ప్రారంభం

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని గోపాలపురంలో ఉన్న శ్రీఆంజనేయస్వామి దేవాలయంలో హనుమాన్ జయంతి వేడుకలను అర్చకులు మంగళవారం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం సుప్రభాతసేవ, ఆరాధన, మన్యసూక్తాభిషేకం, సహస్ర దళాలతో అర్చన, మంగళాశాసనం, ఆరగింపు తదితర కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు ఆలహరి నర్సింహాచార్యులు, ముదుంబై అన్వేష్‌కుమార్ చార్యులు, గ్రామపెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి


ప్రతిభ చాటిన క్రీడాకారులతో మున్సిపల్ కమిషనర్

కోదాడ రూరల్ : విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలని కోదాడ మున్సిపల్ కమిషనర్ రమాదేవి అన్నారు. హైదరాబాద్‌లో ఈనెల 3, 4 తేదీల్లో జరిగిన తెలంగాణ ఏక్విప్డ్ పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్ షిప్ -2025 పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన ఖ్యాతి స్పోర్ట్స్ అకాడమీలో శిక్షణ పొందిన 12 మంది క్రీడాకారులను సూర్యాపేట జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కోచ్ పాలడుగు ఖ్యాతితో కలిసి మంగళవారం కోదాడ పట్టణంలో ఘనంగా సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో పట్టణానికి చెందిన ప్రముఖ న్యాయవాదులు ఎస్ఆర్‌కె.మూర్తి, మేకల వెంకట్‌రావు, మల్లికార్జున్ రెడ్డి, పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ శ్రీనివాస్, జాయింట్ సెక్రటరీ ఓరుగంటి కిట్టు కోచ్ శివ పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు వృత్యంతర శిక్షణ


మునగాల : ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్న ఎంఈఓ వెంకటేశ్వర్లు


చిలుకూరు : మాట్లాడుతున్న ఎంఈఓ గురవయ్య

మునగాల : మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విధులు నిర్వర్తిస్తున్న ఎస్‌జీటీలకు మండల కేంద్రంలో గల మోడల్ స్కూల్ ఆవరణలో ఐదు రోజుల పాటు నిర్వహించే వృత్యంతర శిక్షణ మంగళవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఎంఈఓ పిడతల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు ఈ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఆర్పీలు, పీఆర్పీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

చిలుకూరు : ఉపాధ్యాయులు వృత్యంతర శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ఎంఈవో గురవయ్య అన్నారు. చిలుకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రాథమిక స్థాయి ఉపాధ్యాయులకు ఐదు రోజుల పాటు నిర్వహించే వృత్యంతర శిక్షణను మంగళవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. శిక్షణలో నేర్చుకున్న ప్రతి అంశాన్ని పాఠశాలలో అమలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్‌ఎం కరుణాకర్‌రెడ్డి, జీహెచ్‌ఎం గుజ్జుల నరసింహారెడ్డి, ఉపాధ్యాయులు, ఎమ్‌ఆర్‌పీలు, సీఆర్‌పీలు తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ

హుజూర్‌నగర్ : పట్టణ పరిధిలో కల్లు గీసేందుకు వెళ్లి తాటి చెట్టు పైనుంచి పడి సోమవారం రాత్రి మృతి చెందిన బీఆర్ఎస్ నాయకుడు, గీత కార్మికుడు నర్సింగ్ ధనమూర్తి మృతదేహాన్ని మంగళవారం వివిధ పార్టీల నాయకులు సందర్శించి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు. పరామర్శించిన వారిలో బీఆర్ఎస్, సీపీఐ నాయకులు, స్థానికులు ఉన్నారు.

రెండు గడ్డివాములు దగ్ధం


మంటలు ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్‌లో మంగళవారం రెండు గడ్డివాములు దగ్ధమయ్యాయి. మందా సైదులు, వ్యాసారపు ఉపేంద్రకు మఠంపల్లి రోడ్డులో గల రెండు గడ్డివాములకు ప్రమాదవశాత్తు మంటలు అంటుకున్నాయి. స్థానికులు ఇచ్చిన సమాచారంతో ఫైర్ ఆఫీసర్ పి.సుబ్బరామిరెడ్డి తన సిబ్బందితో వచ్చి మంటలను అదుపుచేసే ప్రయత్నం చేశారు. అప్పటికే సైదులుకు చెందిన 560 గడ్డిమోపులు, ఉపేంద్రకు చెందిన 200 గడ్డిమోపులు దగ్ధమయ్యాయి. మంటలు విస్తరించి పక్కన ఉన్న గడ్డివాములకు అంటుకోకుండా ఫైర్ సిబ్బంది ఆర్పారు.

క్రీడాకారుడికి తీరని కష్టం!

- కబడ్డీ పోటీల్లో తీవ్రంగా గాయపడిన రాజేష్‌కుమార్
- ఆపరేషన్‌కు రూ.మూడు లక్షలు అవసరం
- దాతల సాయం కోసం ఎదురుచూపులు


కన్నీటి గాథ


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రాజేష్

మునగాల: సూర్యాపేట జిల్లా మునగాల మండలంలోని బరాఖత్‌గూడెం గ్రామానికి చెందిన కబడ్డీ క్రీడాకారుడు బెజ్జం రాజేష్‌కుమార్ ఇటీవల కబడ్డీ ఆడుతుండగా తీవ్రంగా గాయపడ్డాడు. నిరుపేద కుటుంబానికి చెందిన రాజేష్‌కుమార్ తండ్రి రాజు లారీ డ్రైవర్‌గా పనిచేస్తుండగా తల్లి రోజువారీ కూలి పనులు చేసి కుటుంబాన్ని పోషిస్తున్నారు. సూర్యాపేట జిల్లా జట్టు తరపున కబడ్డీ పోటీల్లో పాల్గొంటున్న రాజేష్‌కుమార్.. రెండు తెలుగు రాష్ట్రాల్లో జిల్లా తరపున ఎన్నో పోటీల్లో పాల్గొని ప్రతిభ చాటాడు. కబడ్డీ క్రీడాకారులకు, అభిమానులకు సుపరిచితుడైన రాజేష్‌కుమార్ వనపర్తి జిల్లాలో వారం రోజుల క్రితం జరిగిన ఓ ఇన్విటేషన్ టోర్నమెంట్‌లో తన టీమ్‌తో కబడ్డీ ఆడుతూ రైడింగ్‌కు వెళ్లినప్పుడు కోర్టులో కాలు జారి పడిపోయాడు.

మోకాలి కింద తెగిన రెండు నరాలు..

కబడ్డీ కోర్టులో జారిపడిన రాజేష్‌కుమార్‌ను సహచర క్రీడాకారులు వెంటనే స్థానికంగా ప్రాథమిక చికిత్స చేయించి ఖమ్మం పట్టణంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. వైద్య పరీక్షలు నిర్వహించిన డాక్టర్లు.. రాజేష్‌కుమార్ మోకాలి కింద రెండు నరాలు కట్ అయ్యాయని, ఇందు కోసం రెండు సర్జరీలు చేయాల్సి ఉంటుందని తేల్చారు. సర్జరీకి రూ.3 లక్షలు ఖర్చు అవుతుందని వైద్యులు తెలిపారు. ఇప్పటివరకు రూ.రెండు లక్షలు ఖర్చు చేసిన రాజేష్‌కుమార్ తల్లిదండ్రులు.. ఆపరేషన్ చేయించే స్థితిలో లేరు. సర్జరీకి అయ్యే వ్యయం కోసం దాతలు సాయం చేయాలంటూ రాజేష్‌కుమార్ తల్లిదండ్రులు వేడుకుంటున్నారు. రెక్కాడితే గాని డొక్కాడని రాజేష్‌కుమార్ కుటుంబం ప్రస్తుతం ఆస్పత్రిలో ఆపన్నహస్తం కోసం ఎదురుచూస్తోంది. క్రీడాభిమానులు, క్రీడాకారులు, దాతలు స్పందించి ఆర్థికసాయం అందించి ఆదుకోవాలని రాజేష్‌కుమార్ తల్లిదండ్రులు వేడుకుంటున్నారు.

ఆపరేషన్ చేయించే స్థోమత మాకు లేదు


కబడ్డీ ఆటే తన ప్రాణంగా భావించి మా కుమారుడు నిత్యం కబడ్డీ పోటీల్లో పాల్గొంటూ జిల్లాకు ఎన్నో విజయాలు సాధించి పెట్టాడు. అదే ఆటలో పాల్గొని తీవ్ర గాయాలపాలై ప్రస్తుతం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. పూర్తిస్థాయిలో కోలుకోవాలంటే కాలుకు ఆపరేషన్ చేయాలని ఇందుకోసం రూ.3 లక్షలు ఖర్చు అవుతుందని వైద్యులు చెప్పారు. అంత ఖర్చుపెట్టి ఆపరేషన్ చేయించే స్థోమత మాకు లేదు. దయగల వారు ఆర్థికసాయం అందించి ఆదుకోవాలి.

– బెజ్జం భవాని, రాజేష్‌కుమార్ తల్లి, బరాఖత్‌గూడెం

మట్టపల్లిలో నారసింహుని నిత్యకల్యాణం


స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మఠంపల్లి : మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో మంగళవారం శ్రీరాజ్యలక్ష్మి, చెంచులక్ష్మి సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్య కల్యాణాన్ని అర్చకులు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రాతఃకాలార్చన, సుప్రభాత సేవ, నిత్యాగ్నిహోత్రి, పంచామృతాభిషేకం, అష్టోత్తర, సహస్ర నామార్చనలు, అమ్మవార్లకు సహస్ర కుంకుమార్చనలు చేసి ఎదుర్కోళ్ల మహోత్సవం నిర్వహించారు. కల్యాణ వేడుకలో భాగంగా విష్వక్సేనారాధన, పుణ్యాహవచనం, రక్షాభందనం, రుత్విగ్వరణం, మాంగల్యధారణ, తలంబ్రాలతో నిత్యకల్యాణాన్ని కమనీయంగా నిర్వహించారు. అనంతరం నీరాజన మంత్ర పుష్పాలతో మహానివేదన గావించి భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. అదేవిధంగా క్షేత్రపాలకుడైన శ్రీఆంజనేయ స్వామికి తమలపాకులతో ప్రత్యేక అర్చనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు విజయ్‌కుమార్, మట్టపల్లిరావు, ఈఓ నవీన్ కుమార్, అర్చకులు శ్రీనివాసాచార్యులు, పద్మనాభాచార్యులు, బదరీ నారాయణాచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి, అంజనేయాచార్యులు, వంశీకృష్ణమాచార్యులు, భక్తులు పాల్గొన్నారు.

వైద్యం వికటించి గర్భిణి మృతి!

సూర్యాపేటటౌన్ : వైద్యం వికటించి గర్భిణి మృతి చెందిన సంఘటన సూర్యాపేట జిల్లా కేంద్రంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. విశ్వసనీయ సమాచారం మేరకు.. మోతె మండలానికి చెందిన ఓ మహిళ మూడోసారి గర్భం దాల్చింది. అయితే అబ్బాయా.. అమ్మాయా అని తెలుసుకునేందుకు జిల్లా కేంద్రంలోని ఓ స్కానింగ్ సెంటర్‌లో చూపించారు. స్కానింగ్‌లో అమ్మాయి అని తెలియడంతో జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో అబార్షన్ చేసేందుకు ప్రయత్నించగా వైద్యం వికటించి మహిళకు రక్తస్రావం ఎక్కువై పరిస్థితి విషమించింది. వెంటనే ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందింది. అయితే ఆసుపత్రి యాజమాన్యం మృతురాలి కుటుంబ సభ్యులకు కొంత డబ్బులు ఇచ్చేందుకు అంగీకరించినట్టు తెలిసింది. అలాగే ఆసుపత్రికి కూడా బోర్డులు తీసేసి యాజమాన్యం పరారీలో ఉన్నట్లు సమాచారం. కాగా ఈ విషయం మంగళవారం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

నకిలీ వైద్యులతో అప్రమత్తంగా ఉండాలి

సూర్యాపేట అర్బన్ : నకిలీ వైద్యుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రగతిశీల యువజన సంఘం (పీవైఎల్) జిల్లా అధ్యక్షుడు నల్లగొండ నాగయ్య, ప్రగతిశీల మహిళా సంఘం (పీఓడబ్ల్యూ) జిల్లా ప్రధాన కార్యదర్శి నర్సక్క అన్నారు. మంగళవారం పట్టణంలోని చంద్ర పుల్లారెడ్డి విజ్ఞాన కేంద్రంలో విలేకరుల సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. ఈ సమావేశంలో పీవైఎల్ రాష్ట్ర నాయకులు బండి రవి, జిల్లా సహాయ కార్యదర్శి వీరబోయిన రమేష్, డివిజన్ నాయకుడు దూదిపాళ ప్రవీణ్ పాల్గొన్నారు.